క్లుప్తంగా

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

కోవూరు (బుచ్చిరెడ్డిపాళెం) : అనారోగ్య సమస్యలతో పురుగు మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాలకు చెందిన రాజశేఖర్ (45) ఈనెల 21వ తేదీన పురుగు మందు తాగడంతో కుటుంబసభ్యులు చెన్నైలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

సింహపురి నుంచి షిర్డీకి సాయిభక్తుల యాత్ర

నెల్లూరు(బృందావనం): సుమారు 500 మందికి పైగా సాయి మాలధారణతో ఆదివారం షిర్డీకి బయలుదేరారు. బాలాజీనగర్ శివారు పద్మావతి నగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఇరుముడులు ధరించి నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌కు షిర్డీ సాయినాథుడి చిత్రపటంతో పాదయాత్ర చేపట్టారు. బాలాజీనగర్, ఆత్మకూరు బస్టాండ్‌ల మీదుగా ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆ మందిరం మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ 41 రోజులుగా సాయి మాలధారణతో మండలదీక్ష చేపట్టిన సుమారు 300 మంది ఇరుముడులధారణతో, అలాగే నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మరో 200 మంది షిర్డీ యాత్రకు బయలుదేరారన్నారు. 23 సంవత్సరాలుగా సింహపురి నుంచి షిర్డీకి క్రమం తప్పకుండా యాత్ర చేపడుతున్నామన్నారు. అక్కడ వారంరోజులు వివిధ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొంటారని వివరించారు.

'వాకర్స్' అధ్యక్షుడిగా నరసింహయాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : వేదాయపాళెంలోని గాంధీ నగర్ రోడ్డు పార్క్‌లో మహాత్మా గాంధీ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంఎల్ నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్సీ మీరా మొహిద్దీన్, కోశాధికారిగా వి.విజయ కుమార్, గౌరవాధ్యక్షుడిగా మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా అధ్యక్షుడు నరసింహయాదవ్‌ను సత్కరించారు. నగరపాలక సంస్థ, దాతల సహకారంతో పార్కును అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ వ్యవస్థాపకులు మస్తాన్‌గౌడ్, ఎం.రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపికలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం సీనియర్ సాఫ్ట్‌బాల్ పురుష, మహిళ జట్ల ఎంపికలు జరిగినట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మలిరెడ్డి కోటారెడ్డి, సీహెచ్ కామేశ్వరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు పదో సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలియజేశారు.

పేదల సొంతింటి కల సాకారం దిశగా..

- జగనన్న లేఅవుట్‌లలో చురుగ్గా ఇళ్ల నిర్మాణం
- మండలానికి 2,484 ఇళ్ల మంజూరు



జగనన్న లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

మనుబోలు : ఏళ్ల తరబడి సొంతిల్లు లేక బాడుగ ఇళ్లల్లో ఉంటూ ప్రతినెలా అద్దెలు చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల బతుకుల్లో వెలుగులు నిండుతున్నాయి. పేదవాడి సొంతింటి కలను నిజం చేసే దిశగా ఊరూరా జగనన్న లేఅవుట్‌లను ఏర్పాటు చేసి పేదలకు ఇంటి స్థలాలు కేటాయించడమే కాకుండా ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా మండలంలోని పేదలకు నివేశన స్థలాలు కేటాయించి ఇళ్లను మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం మండలంలోని జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది.

మండల పరిధిలో..

మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 21 జగనన్న లేఅవుట్లను ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 2,484 ఇళ్లు పేదలకు మంజూరు కాగా వీటిలో 412 ఇళ్లు ఇప్పటికే పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. వివిధ కారణాలతో 172 ఇళ్లు ప్రారంభించాల్సి ఉండగా మిగిలిన 1,900 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. మనుబోలు, జట్లకొండూరు, కాగితాలపూరు, బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాల్లోని లేఅవుట్‌లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్థిక స్థోమత ఉన్న లబ్ధిదారులు స్వయంగా ఇళ్లు నిర్మించుకుంటుండగా, లేనిచోట ప్రభుత్వమే కాంట్రాక్టర్‌లను ఏర్పాటు చేసి ఇళ్ల నిర్మాణం చేయిస్తోంది. కాగా మండలంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పేదలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.15 వేలు అందించి వేగంగా ఇళ్లు నిర్మించుకునేందుకు సహకారం అందిస్తున్నారు. వీరిలో మొదటి విడతగా 172 మందికి, రెండో విడతలో 90 మందికి కలిపి మొత్తం 260 మందికి రూ.15 వేలు అందించారు. ఇంకా ఎవరైనా లబ్ధిదారులు ఉంటే వారికి సైతం రూ.15 వేలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ మొదలు తహసీల్దార్ వరకూ గృహ నిర్మాణ శాఖ అధికారులతో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తరచూ లేఅవుట్‌లను తనిఖీ చేస్తూ ఇళ్ల పురోగతిపై సమీక్షిస్తున్నారు. లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ వేగంగా ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.



నిర్మాణం పూర్తయిన ఇల్లు

లబ్ధిదారులకు అన్నివిధాలా సహకారం



ఇళ్లను నిర్మించుకునేందుకు లబ్ధిదారులకు అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తున్నాం. ఇసుక, సిమెంటు, స్టీలు అందుబాటులో ఉంచి సరఫరా చేస్తున్నాం. వివిధ దశల్లో లబ్ధిదారులకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తున్నాం. సొంతంగా నిర్మించుకునే స్తోమత లేని వారికి కాంట్రాక్టర్‌లను ఏర్పాటు చేసి ఇళ్లు కట్టించి ఇస్తున్నాం.

– రవికుమార్, హౌసింగ్ ఏఈ

కల నెరవేరింది



ఎన్నో సంవత్సరాలుగా సొంత ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నాం. ఇన్నాళ్లకు జగనన్న ప్రభుత్వం మాకు ఇంటి స్థలం కేటాయించడమే కాకుండా ఇంటిని నిర్మించుకునేందుకు ఆర్థిక సహకారం అందిస్తోంది. సొంత ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశం కూడా చేశాం. లేఅవుట్‌లలో తాగునీటి వసతి, కరెంటు, వీధులు తదితర వసతులను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీధి స్తంభాలకు లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో కొంచెం ఇబ్బందిగా ఉంది. ఇన్నాళ్లకు సొంతింటి కల నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉంది.

– చింతల జయశీల, లబ్ధిదారు

కష్టాలు తొలగిపోనున్నాయి



సొంత ఇల్లు లేకపోవడంతో గత 17 సంవత్సరాలుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. చాలీచాలని సంపాదనతో ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. సొంతిల్లు లేక ఇబ్బందులు పడుతున్నా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువతో ఎట్టకేలకు మాకు జగనన్న లేఅవుట్‌లో స్థలం కేటాయించడంతో పాటు ఇంటి నిర్మాణం కోసం వివిధ దశల్లో రూ.1.80 లక్షలు ఇచ్చారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలో ఇంటి కష్టాలు తొలగిపోనున్నాయి.

– పారి అనిత, లబ్ధిదారు

వయోజనులకు 'అక్షర చైతన్యం' పరీక్ష



పొదలకూరు కేంద్రంలో పరీక్ష రాస్తున్న వయోజనులు



మనుబోలు : పరీక్షలు రాస్తున్న వయోజనులు

పొదలకూరు : మండలంలోని వయోజనులకు అక్షర చైతన్యం పరీక్షను ఆదివారం నిర్వహించారు. మొత్తం 49 కేంద్రాలను ఏర్పాటు చేసి పరీక్షను జరిపినట్లు ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు. మొత్తం 1,371 మంది ఉండగా 1,308 మంది పరీక్షకు హాజరైనట్లు తెలియజేశారు.

21 కేంద్రాల్లో..

మనుబోలు : అక్షర చైతన్యం–2 కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 కేంద్రాల్లో వయోజనులకు ఆదివారం పరీక్షలు నిర్వహించామని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఆయన మడమనూరులోని పరీక్ష కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 630 మంది వయోజనులు అక్షర చైతన్యం కార్యక్రమంలో భాగంగా రాయడం, చదవడం నేర్చుకుంటున్నారని తెలిపారు. వీరిలో 610 మంది పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. పరీక్షలను సీఆర్‌ఎంటీలు చెంచురామయ్య, శ్రీనివాసులు, స్వరూప పర్యవేక్షించారు. ఇన్విజిలేటర్లుగా సచివాలయ పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్‌లను నియమించారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



పోలయ్యకు ట్రై సైకిల్ అందజేస్తున్న ఎంపీడీఓ తదితరులు

మనుబోలు : చాలా కాలంగా ట్రై సైకిల్ కోసం ప్రయత్నిస్తున్న దివ్యాంగుడికి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం అందజేశారు. మండలంలోని గోవిందరాజపురం గ్రామానికి చెందిన తాళ్లూరు పోలయ్య దివ్యాంగుడు. నడవలేని ఈయన గత ప్రభుత్వ హయాం నుంచి ట్రై సైకిల్ కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి గుంజి రమేష్ మంత్రి కాకాణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించి పోలయ్యకు ట్రై సైకిల్ మంజూరు చేయించారు. కాగా దీనిని ఎంపీడీఓ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ ఆదివారం పోలయ్యకు అందజేశారు. దీంతో పోలయ్య హర్షం వ్యక్తం చేస్తూ కాకాణికి రుణపడి ఉంటానని తెలిపారు. వారి వెంట గుంజి రమేష్, ఆవుల తులసీరాం ఉన్నారు.

పేద బ్రాహ్మణుల సంక్షేమానికి సహకారం



మాట్లాడుతున్న ఫోరం నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): సమాజంలో నిరుపేదలైన బ్రాహ్మణుల సంక్షేమం కోసం బ్రాహ్మణ సమైఖ్యతా వేదిక కృషి చేస్తుందని ఆ వేదిక నిర్వాహకుడు దూబగుంట రామచంద్రరావు తెలిపారు. ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని శ్రీకురువాడ లలితమ్మ కల్యాణ మండపంలో బ్రాహ్మణ సమైఖ్యతా వేదిక సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ తమ సోదరుడు దూబగుంట వేంకటేశ్వరరావు 2018లో యునైటెడ్ బ్రాహ్మిణ్ ఫోరం స్థాపించి వివిధ సేవ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ఆయన ఆశయ సాధన మేరకు ఫోరంలోని సభ్యులు తమ సొంత నిధులను వెచ్చించి పేద బ్రాహ్మణులకు అండగా నిలవాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో పవని నాగేంద్ర ప్రసాద్, శ్రీశైలం శ్రీధర్, ఎస్‌పీఎల్ వరప్రసాద్, ఎం.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆరోగ్య సురక్ష సర్వే



పొదలకూరులో పరీక్షల తర్వాత టోకెన్ అందజేస్తున్న ఏఎన్‌ఎం

పొదలకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే మండలంలో ముమ్మరంగా జరుగుతోంది. పొదలకూరు, తోడేరు, ఆర్‌వైపాళెం గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల్లో దీర్ఘకాలిక వ్యాధుల వివరాలను అడిగి తెలుసుకుంటున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నరసింహారావు తెలిపారు. ముందుగా 10 సంవత్సరాలు నిండిన బాలుడి నుంచి పెద్దల వరకు బీపీ, షుగర్, హెచ్‌బీ పరీక్షలను విధిగా నిర్వహిస్తామన్నారు. సచివాలయాల్లో వైద్యనిపుణుల ద్వారా శిబిరాలు నిర్వహించడానికి 20 రోజుల ముందు నుంచి ఇంటింటి సర్వే నిర్వహించాల్సిందిగా ఉత్తర్వులు వచ్చినట్లు పేర్కొన్నారు. సర్వే పూర్తి చేసిన కుటుంబాల్లో వ్యాధులు ఉన్నవారికి ఆరోగ్య సిబ్బంది టోకెన్లను అందజేస్తున్నారు. వీటి ప్రకారం వారు ఆయా సచివాలయాల్లో నిర్వహించే వైద్యశిబిరానికి వలంటీర్లతో కలిసి హాజరు కావాల్సి ఉంటుంది.

జై గణేశా.. బై బై గణేశా



మనుబోలు: గమళ్లపాళెం వినాయకుడి గ్రామోత్సవం



ముత్తుకూరు నుంచి తరలుతున్న విగ్రహం

- వేడుకగా గణనాథుల విగ్రహాల నిమజ్జనం

వెంకటాచలం : మండలంలోని పలు గ్రామాల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం ఆదివారం వేడుకగా సాగింది. మండలంలోని తిక్కవరప్పాడు హరిజనవాడ, గొలగమూడి, కాకుటూరు, కసుమూరు గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. యువత కేరింతలు, నృత్యాలతో ఉత్సాహంగా గ్రామోత్సంలో పాల్గొన్నారు. అనంతరం సమీప చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

కొనసాగుతున్న నిమజ్జనం

ముత్తుకూరు : మండలంలోని అనేక గ్రామాల్లో వినాయక చవితి పండగ సందర్భంగా ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాలను ఆదివారం పెద్ద ఎత్తున నిమజ్జనం చేసేందుకు సముద్రానికి తరలించారు. ఫలితంగా కృష్ణపట్నం వద్ద తీరానికి వెళ్లే మార్గం కిక్కిరిసిపోయింది. బ్రహ్మదేవి, పంటపాళెం, వల్లూరు, నారికేళపల్లి గ్రామాల నుంచి ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించిన వాహనాల్లో వినాయకుడి విగ్రహాలను ఊరేగించారు. బాణసంచా కాలుస్తూ, స్త్రీ పురుషులు రంగులు చల్లుకొంటూ తప్పెట్ల తాళాల మధ్య విగ్రహాలను సముద్రం వద్దకు తరలించారు. చివరిసారిగా అక్కడ పూజలు చేసి నీటిలో నిమజ్జనం చేశారు.

వైభవంగా..

- మనుబోలు : మండలంలో వినాయక చవితి సందర్భంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన బొజ్జగణపయ్య విగ్రహాలకు ఆదివారం వైభవంగా గ్రామోత్సవాలు నిర్వహించారు. అనంతరం సమీపంలోని చెరువులు, వాగుల్లో విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. మండల కేంద్రమైన మనుబోలులోనే 20 పైగా విగ్రహాలను వివిధ కూడళ్లలో ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి నుంచి వివిధ మండపాల్లో కొలువుదీర్చిన బొజ్జ గణపయ్యలకు ప్రత్యేక పూజలు చేసి అనంతరం అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని కమాల్ వంతెన వద్ద కండలేరులో నిమజ్జనం చేశారు. పోలేరమ్మ ఆలయం వద్ద వినాయక మండపంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గమళ్లపాళెంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో లడ్డూకు వేలం వేయగా రూ.70 వేలకు కోసూరు బ్రదర్స్ వారు దక్కించుకున్నారు. మరికొద్ది రోజులపాటు నిమజ్జనాలు కొనసాగుతాయి.

తీరంలో కోలాహలం

ఇందుకూరుపేట : వినాయక చవితి ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన నిమజ్జనోత్సవానికి మైపాడు తీరం వేదికైంది. దీంతో మండల పరిధిలోని వినాయక విగ్రహాలనే కాకుండా నెల్లూరు నగరంతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి సైతం భారీ సంఖ్యలో వినాయకుని విగ్రహాలను ఆదివారం మైపాడు తీరానికి తీసుకొచ్చారు. యువకులు రంగులు చల్లుకుంటూ బాణసంచా కాలుస్తూ తప్పెట్లు డీజేల మధ్య కేరింతలు కొడుతూ వినాయకుని విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. తీరానికి తీసుకొచ్చిన వినాయక విగ్రహాలకు చివరిసారిగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. అనంతరం యువకులు సముద్ర స్నానాలు ఆచరించి ఉత్సాహంగా గడిపారు. దీంతో తీరంలో కోలాహలం నెలకొంది.



వెంకటాచలం: తిక్కవరప్పాడు హరిజనవాడలో గణనాథుని గ్రామోత్సవం



మనుబోలు: పోలేరమ్మ ఆలయం వద్ద అన్నదానం



ఇందుకూరుపేట : మైపాడుకు తీసుకొస్తూ..



ముత్తుకూరు : పంటపాళెం నుంచి నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుని విగ్రహం



ఇందుకూరుపేట : తీరంలో గణనాథునికి పూజలు చేస్తున్న యువకులు



ఇందుకూరుపేట : విశేషాలంకరణలో గణనాథుడు

15 నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో గుంజ ప్రతిష్ఠ



గుంజను ప్రతిష్ఠించి పూజ చేస్తున్న అర్చకులు

నెల్లూరు(బృందావనం) : నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు 49వ శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం గుంజ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ పొట్లూరి స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్, జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారి జె.శ్రీనివాసరావు, రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గుంజ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారికి రంగారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు.

భక్తుల కోసం ఏర్పాట్లు

ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిపేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని ఎంపీ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారని వివరించారు. త్వరలో ఆదాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారని వెల్లడించారు. దేవస్థానం అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తున్న రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఆలయాభివృద్ధిలో భాగంగా 29 సెంట్ల స్థలం చెందేలా సహాయ సహకారాలందించిన పూర్వ కలెక్టర్ చక్రధర్‌బాబు, ప్రస్తుత కలెక్టర్ హరినారాయణన్‌కు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి సంబంధించి ప్రక్రియను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని రంగారెడ్డి వెల్లడించారు. నగర మేయర్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. జయరామ్ మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న ఎంపీ ఆదాల, వేమిరెడ్డి దంపతులకు ధన్యవాదాలు తెలిపారు.

- అక్టోబర్ 2న రాజరాజేశ్వరి అమ్మవారి మాలధారణ కార్యక్రమం 17వ సంవత్సరం చేపట్టనున్నట్లు పెంచలరెడ్డి తెలిపారు. సమావేశంలో ధర్మకర్తల మండలి సభ్యులు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



గుంజ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న వారు



ఆహ్వానపత్రికలు ఆవిష్కరించిన మేయర్, విజయ డెయిరీ చైర్మన్ తదితరులు